క్లుప్తంగా

గుప్తనిధుల తవ్వకాలు



నడికూడ : మండలంలోని కౌకొండ, ధర్మారం గ్రామాల శివారులోని వ్యవసాయ భూమిలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పాము పుట్టకు పూజలు చేసి గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టినట్టు తెలుస్తోంది. తవ్వకాల చుట్టూకు సుమారు 10 మీటర్ల మేర ఎరుపు, తెలుపు, పసుపు రంగు దారాలకు నిమ్మకాయలు కట్టారు. పసుపు, కుంకుమ చల్లినట్టు కనపడుతోంది. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు, రైతులు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు విచారణ చేపట్టి గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

ధర్మసాగర్ (వేలేరు) : మండలంలోని మల్లికుదుర్ల గ్రామంలో ప్రభుత్వ చెరువు శిఖంలో మట్టి పోయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై నవీన్ కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మల్లికుదుర్ల గ్రామానికి చెందిన బట్టు ప్రభాకర్ గ్రామంలోని ఊర చెరువు శిఖం భూమిలో మట్టి పోయించి లెవల్ చేయిస్తుండగా ఇరిగేషన్ శాఖ ఏఈ రాంరెడ్డి అడ్డుకునేందుకు యత్నించారు. చెరువు శిఖం భూమిలో మట్టి పోయించడం చెప్పినా ప్రభాకర్ వినలేదు. దీంతో ప్రభాకర్‌పై ఏఈ రాంరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

మైనార్టీ మోర్చా కమిటీ ఎన్నిక



కమలాపూర్ : మైనార్టీ మోర్చా మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు బీజేపీ మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్‌రెడ్డి, మైనార్టీ మోర్చా మండల అధ్యక్షుడు రాజీమహ్మద్ శనివారం నియామక పత్రం అందజేశారు. ఉపాధ్యక్షులుగా మహ్మద్ పాషా, ఎండీ.సలీం, కాసీం, ఎస్‌కే.హోలీ, ప్రధాన కార్యదర్శులుగా ఎస్‌డీ.పెద్ద హుస్సేన్, ఎండీ.అక్రమ్, కార్యదర్శులుగా ఎండీ.రఫీ, అంకూస్, రజాక్, యాకూబ్‌పాషా, రియాజ్, మైబెల్లి, కోశాధికారిగా ఎండీ.అంకూస్, సోషల్ మీడియా కన్వీనర్‌గా ఎండీ.రఫీ, కార్యవర్గ సభ్యులుగా ఎండీ.హబీబ్, జలీల్, అంకూస్, రఫీ, హాజీమియా, ఆరీఫ్, మైబెల్లి, ఖాజా, ఖైరుల్లా, కాసీం, చాంద్‌పాషా, జలీల్, అంకూస్, రఫీ ఎన్నికై నట్టు వివరించారు. కమిటీ తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

ఆత్మకూరు : కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే మండలంలోని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాలు వర్తించాయని చెప్పారు. రోడ్లు సైతం అభివృద్ధి చెందాయని తెలిపారు. ప్రజాకాంక్షను గౌరవిస్తూ కాంగ్రెస్ అధిష్టానమే తెలంగాణ ఇచ్చిందని గుర్తు చేశారు. అనేక మోసపూరిత హామీలు గుప్పించి ఓట్లు దండుకుని కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చి తదనంతరం ప్రజలను విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తున్నాయని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ నాయకులు ఆడంబరాలకే పరిమితమయ్యారని మండిపడ్డారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవిందర్ గౌడ్, డైరెక్టర్ రేవూరి జయపాల్‌రెడ్డి, నాయకులు తనుగుల సందీప్, అలువాల రవి తదితరులు పాల్గొన్నారు.

30న సర్వసభ్య సమావేశం

ఎల్కతుర్తి : ఈనెల 30న మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తూర్పాటి సునీత తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు నివేదికలతో సకాలంలో హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి యోగా తరగతులు

హన్మకొండ: హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో ఈనెల 29 నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ప్రముఖ యోగా గురువు పోశాల శ్రీనివాస్ తెలిపారు. రోజు ఉదయం, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు తరగతులు ఉంటాయని చెప్పారు. ఆసక్తి గల వారు 93947 66001 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

భూములను కాపాడాలి

మడికొండ : మడికొండలోని వేణుగోపాలస్వామి ఆలయ భూములను కాపాడాలని విశ్వ హిందూ పరిషత్ వరంగల్ మహానగర కార్యదర్శి శ్రీరాం ఉదయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆలయ భూములను ఆ పరిషత్ సభ్యులు శనివారం సందర్శించగా ఉదయ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో వరంగల్ మహానగర అధ్యక్షుడు కేసిరెడ్డి జైపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వెలగందుల రాజు, సహాయ కార్యదర్శి రమేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నల్లబారుతున్న తెల్లబంగారం

- పత్తి రైతులను వేధిస్తున్న కూలీల కొరత
- ఆందోళనలో అన్నదాతలు



ఎల్కతుర్తి శివారులో చివరి కాత ఏరేందుకు సిద్ధంగా ఉన్న పత్తి పంట

ఎల్కతుర్తి : మండలంలో యాసంగి వరినాట్లు ప్రస్తుతం చివరిదశకు చేరుకోగా ముందుగా వేసిన వరినాట్లలో కలుపు దశకు చేరుకున్నాయి. ఈ క్రమంలో కూలీలు దొరక్క పత్తి రైతులు వేదనకు గురౌతున్నారు. సంక్రాంతికి ముందే కాయ పగిలి పత్తి ఏరాల్సిన పరిస్థితి నెలకొంది. మండలవ్యాప్తంగా ఖరీఫ్‌లో దాదాపు 4 వేల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. ప్రారంభంలో వర్షాలు జోరుగా కురవడంతో అక్కడక్కడా పత్తి పంటకు కొంత నష్టం వాటిల్లినా వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేయడంతో రానురాను పంట తిరిగి చిగురించింది. పత్తి పంటను గ్రామాల్లో రైతులు ఇప్పటికే 2, 3 సార్లు ఏరించారు. కాగా చివరి దశలో కాసిన కాత మొత్తం పగిలి పత్తి ఏరే దశకు చేరుకుంది. ఇదే సమయంలో యాసంగి వరినాట్లు జోరందుకోవడంతో కూలీలు ఆ వైపే మొగ్గుచూపారు. ప్రస్తుతం వరినాట్లు చివరి దశకు చేరుకోగా కూలీలు కలుపు తీసే పనిలో బిజీ అయ్యారు. ఈ పరిస్థితిలో కూలీల కొరత నెలకొంది. అలాగే ఉదయం కురుస్తున్న మంచుకు చేతికందిన తెల్లబంగారం నల్లబడిపోతోంది.

కూలీల కొరతతో ఇబ్బంది



వానాకాలంలో రెండున్నర ఎకరాలు పత్తి సాగు చేశా. ప్రస్తుతం పత్తి పంట చివరి దశకు చేరుకుంది. సంక్రాంతికి ముందే పత్తికాయ మొత్తం పగిలి పత్తి ఏరేందుకు సిద్ధమైంది. అలాగే యాసంగి వరి నాట్ల జోరు వల్ల పత్తి ఏరేందుకు కూలీలు దొరకట్లేదు. చివరలో ఏరాల్సిన పత్తి కూలీలు దొరక్క అలాగే నిలిచిపోయింది. చెట్ల మీదున్న పత్తి మొత్తం మంచుకు నల్లబడి పోతోంది.

-ముద్రబోయిన లచ్చమ్మ, రైతు

‘ఈజీఎస్’కు అనుసంధానం చేయాలి



వ్యవసాయ రంగానికి కూలీల కొరత నానాటికీ తీవ్రమౌతోంది. అదనపు పెట్టుబడి పెడితే పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదు. రైతులు భారీగా నష్టపోతున్న దుస్థితి నెలకొంది. ఉపాధి హామీ పథకానికి వ్యవసాయాన్ని అనుసంధానం చేస్తే రైతులకు ఆర్థిక భారం తగ్గి లాభసాటిగా మారే అవకాశం ఉంది. ఈ విషయమై ప్రభుత్వం స్పందించాలి.

-కర్రె భిక్షపతి, సీపీఐ జిల్లా కార్యదర్శి

విద్యార్థుల బంగారు భవిష్యత్తే లక్ష్యం

- ‘ఏకశిల’ చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి



ఎమ్మెల్యే రమేష్‌ను సన్మానిస్తున్న తిరుపతిరెడ్డి

ఐనవోలు : విద్యార్థుల బంగారు భవిష్యత్తే లక్ష్యంగా ఏకశిల విద్యాసంస్థలను నడిపిస్తున్నట్టు చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి తెలిపారు. మండలంలోని పున్నేలు క్రాస్ సమీపంలోని ఏకశిల ఈ-టెక్నో స్కూల్‌లో శనివారం నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా వరంగల్ ఎన్ఐటీ రిజిస్ట్రార్ ఎస్.గోవర్ధన్‌రావు, ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ పాల్గొనగా తొలుత తిరుపతిరెడ్డి మాట్లాడారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులను అత్యున్నతులుగా తీర్చిదిద్దే దిశగా పాఠశాలల్లో బోధన సాగిస్తున్నట్టు తెలిపారు. పదో తరగతిలో 10 సీజీపీఏ సాధించిన విద్యార్థులకు, సీబీఎస్ఈలో అత్యుత్తమ మార్కులు సాధించిన వారికి ఏకశిల జూనియర్ కాలేజీలో ఉచితంగా విద్య అందిస్తామని ప్రకటించారు. అనంతరం అతిథులు గోవర్ధన్‌రావు, వరదారెడ్డి, అరూరి రమేష్ మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని కాంక్షించారు. విద్యార్థులు అతిథులకు ఎన్‌సీసీ కవాతుతో స్వాగతం పలికారు. సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం అతిథులను తిరుపతిరెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరక్టర్లు బేతి కొండల్‌రెడ్డి, ముచ్చ జితేందర్‌రెడ్డి, జయభరత్‌రెడ్డి, ఎండీ.బాబా, రవికిరణ్, భిక్షపతి, లవకుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పరిశీలన



దామెర : మండల కేంద్రంలోని, పులుకుర్తి, ల్యాదెళ్ల, వెంకటాపూర్, కోగిల్వాయి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను పంచాయతీ రాజ్ శాఖ డీఈ లింగారెడ్డి శనివారం పరిశీలించారు. అంగన్‌వాడీ భవనాల స్థితిగతులను తనిఖీ చేశారు. అనంతరం డీఈ మాట్లాడారు. పలుచోట్ల పిల్లర్లు లేకుండా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయని తెలిపారు. వాటి మరమ్మతులకు అంచనాలు సిద్ధం చేస్తామన్నారు. ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. ఆయన వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులున్నారు.

ఫిబ్రవరి 4 నుంచి శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి భిక్షపతి

ఎల్కతుర్తి : ఫిబ్రవరి 4 నుంచి 6 వరకు మండల కేంద్రంలో సీపీఐ జిల్లాస్థాయి శాఖ కార్యదర్శుల రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి తెలిపారు. మండల కేంద్రం శివారులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ పేదల పక్షాన భూపోరాటాలు కొనసాగిస్తోందని చెప్పారు. పేదలు గుడిసెలు వేసుకున్న భూములకు పట్టాలు ఇవ్వాలని, పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం జాతీయవాదం, మతం పేరుతో ప్రజల నడుమ చిచ్చుపెడుతోందని ధ్వజమెత్తారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ చేపట్టేందుకు తలపెట్టిన శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి ఉట్కూరి రాములు, జిల్లా కార్మిక సభ్యుడు కర్రె లక్ష్మణ్, తండ మొండయ్య, భాస్కర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, స్వామి, తిరుమల, లలిత, మధుకర్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

నటి జమునకు శ్రద్ధాంజలి

హన్మకొండ కల్చరల్: హనుమకొండ విజయపాల్ కాలనీలోని ఏకశిల కరోకే క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో నటి జమునకు శనివారం సాయంత్రం శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో భాగంగా కమిటీ సభ్యులు జమున చిత్రపటానికి పూలమాలవేసి మౌనం పాటించారు. అనంతరం గాయనీ, గాయకులు.. జమున నటించిన సినిమాల్లోని పాటలు పాడారు. కార్యక్రమంలో క్లబ్ కార్యవర్గ సభ్యులు కూజ విజయ్‌కుమార్, ప్రగళ్లపాటి రాజ్‌కుమార్, శ్రీగిరిరాజు రేవతి, నిమ్మల శ్రీనివాస్, సాగంటి మంజుల, సుధారాణి, జట్టి లత, నీరజ, రేణుక, శివ, సుధాకర్ పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యనభ్యసించాలి



విద్యార్థులకు పురస్కారాలు అందజేసిన రావు

కాజీపేట: లక్ష్యాన్ని నిర్దేశించుకుని చక్కగా చదువుకున్నప్పుడే జీవితంలో రాణించగలుగుతారని రిటైర్డ్ కెప్టెన్ గుర్రపు జగదీశ్వర్ రావు (జీజే.రావు) సూచించారు. మూడేళ్లుగా పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 13 మంది విద్యార్థులకు కాజీపేట 63వ డివిజన్ విద్యానగర్ కాలనీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నగదు పురస్కారాలతో పాటు ప్రశంసపత్రాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలకు ఏదైనా చేయాలనే సంకల్పంతోనే ప్రతిఏటా క్రమం తప్పకుండా విద్యార్థులకు నగదుతో పాటు పాఠశాలలో కనీస సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈమేరకు జీజే.రావు, పుష్పలత దంపతులను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుధాకర్, హాస్టల్ వార్డెన్ రజిత, చిగురిపాటి వెంకటేశ్వర్లు, జి.సుధాకర్ రావు, వీరప్రకాష్, జ్యోతిలక్ష్మి, సంధ్యకుమారి, వీరబాబు పాల్గొన్నారు.

అర్హులనే గుర్తించాలి

విద్యారణ్యపురి: పదోన్నతులు, బదిలీల్లో అర్హులైన ఉపాధ్యాయ దివ్యాంగులనే గుర్తించాలని దివ్యాంగుల సామాజిక వేదిక వ్యవస్థాపకుడు బిల్ల మహేందర్ కోరారు. ఈమేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఎండి.అబ్దుల్‌హైని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లాకు సంబంధించిన స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి పొందే కేటగిరీలో సబ్జెక్టుల వారీగా పీహెచ్‌సీ లిస్టు ప్రత్యేకంగా లేదని పేర్కొన్నారు. అలాగే, వరంగల్ ఎంజీఎంలో ప్రారంభమైన స్పెషల్ మెడికల్ బోర్డులో దివ్యాంగ ఉపాధ్యాయులను సరిగా గుర్తించడం లేదన్నారు.

శిక్షణ కేంద్రం ప్రారంభం

హన్మకొండ చౌరస్తా: దమ్మికా కాయ్ షిటోరియె కరాటే అకాడమీ ఆధ్వర్యంలో హనుమకొండ మచిలీబజార్‌లోని ప్రభుత్వ పాఠశాలలో బాలికల కోసం ప్రత్యేకంగా కరాటే శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈమేరకు 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ అమ్మాయిల ఆత్మరక్షణ కోసం కరాటేలో శిక్షణ అందించాలని సూచించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. రాణిలక్ష్మీబాయి ఆత్మరక్ష సెల్ఫ్ డిఫెన్స్ పేరుతో కార్యక్రమాన్ని చేపట్టినట్లు అకాడమీ చీఫ్ మాస్టర్ బండారి సంతోష్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రశీద అక్తర్ తస్లీమ్, రజనీకాంత్, కుమార్‌యాదవ్, సతీష్, వరుణ్, ఉపాధ్యాయులు మంజుల, మనీశ్వరి, స్వాతి, పద్మ, ఉషారాణి, సుధాకర్, యూసఫ్, కరాటే కోచ్ సుప్రియ పాల్గొన్నారు.

భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలి



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కాశిబుగ్గ: వరంగల్ జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అక్కనపల్లి యాదగిరి డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో లేబర్ కాలనీ, 100ఫీట్ల రోడ్డు నుంచి వెంకట్రామ జంక్షన్ వరకు శనివారం భారీ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ నగరంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వచ్చే బడ్జెట్లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని సూచించారు. నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే చిన్న తరహా, మధ్య, భారీతరహా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఏనుమాముల మార్కెట్ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. 30ఏళ్ల క్రితం నగరానికి చెందిన వేలాది మందికి అజంజాహి మిల్లు ఉపాధి కల్పించిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్కే పాషా, అనిత, రవి, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని నిర్మాణాల కూల్చివేత



ప్రహరీని కూల్చివేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది

వరంగల్ అర్బన్: బల్దియా పరిధిలోని 18వ డివిజన్ లేబర్ కాలనీలో అక్రమంగా నిర్మించిన ప్రహరీని వరంగల్ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం సభ్యులు, బల్దియా డీఆర్‌ఎఫ్ సిబ్బంది శనివారం కూల్చివేశారు. 3వ డివిజన్ ఆరెపల్లిలో రోడ్డును ఆక్రమించి చేపట్టిన పిల్లర్లను తొలగించారు. ఈ సందర్భంగా బల్దియా సిటీ ప్లానర్ వెంకన్న మాట్లాడుతూ అనధికారికంగా స్థలాలను ఆక్రమించుకుని నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుని, క్రిమినల్ కేసు నమోదు చేసి నిర్మాణాలను తొలగించనున్నట్లు హెచ్చరించారు. టీఎస్ బీపాస్ ద్వారా అనుమతి పొందిన తర్వాత మంజూరు చేసిన ప్లాన్ (నక్షా) ప్రకారం భవనాలు నిర్మించుకోవాలని సూచించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న వినయ్‌భాస్కర్

హన్మకొండ అర్బన్: నియోజకవర్గంలోని సుమారు 200మంది లబ్ధిదారులకు కల్యాలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ హనుమకొండ కలెక్టరేట్‌లో శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో హనుమకొండ తహసీల్దార్ గనిపాక రాజ్‌కుమార్, మైనార్టీ అధికారి మేన శ్రీను, కార్పొరేటర్ చెన్నం మధు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి



కౌశిక్‌రెడ్డి ఫ్లెక్సీ దహనం చేస్తున్న నాయకులు

కమలాపూర్ : తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌పై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ జంక్షన్‌లోని ప్రధాన రహదారిపై ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఫ్లెక్సీని శనివారం దహనం చేశారు. అనంతరం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కౌశిక్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుండవు చరణ్ పటేల్, ఓబీసీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ తౌటం రవీందర్ మాట్లాడారు. రాష్ట్ర గవర్నర్ పదవిలో ఉన్న మహిళపై ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి అసభ్య పదజాలంతో వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. సీఎం కేసీఆర్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకే గవర్నర్‌పై ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశాడని ఆరోపించారు. ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డికి బీసీలంటే చులకన భావం ఉండడం వల్లే వ్యాఖ్యలు చేశాడని ధ్వజమెత్తారు. వెంటనే వ్యాఖ్యలు ఉపసంహరించుకుని గవర్నర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని డిమాండ్ చేశారు. మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామని, ఎమ్మెల్సీని గ్రామాల్లో తిరగకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. కాగా 13 మంది కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి సొంత పూచీకత్తుపై వదిలేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దేశిని అయిలయ్యగౌడ్, నాయకులు కిన్నెర కృష్ణమూర్తి, ప్రసాద్, కొండ రమేష్, కృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, ఓదెలు, హనుమాన్ ప్రసాద్, మనీష్‌గౌడ్, అనిల్, కుమార్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఆరె కులస్తులను ఓబీసీగా గుర్తించండి



హరీష్‌రావుకు మొక్క బహూకరిస్తున్న శివాజీ

దామెర : ఆరె కులస్తులకు ఓబీసీగా గుర్తించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావును ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీ కోరారు. నగరానికి శనివారం వచ్చిన సందర్భంగా మంత్రిని మండలంలోని ఊరుగొండకు చెందిన శివాజీ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క బహూకరించారు. అనంతరం సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఓబీసీగా గుర్తించకపోవడం వల్ల ఆరె కులస్తులు విద్య, ఉద్యోగం, ఉపాధి, ఇతర రంగాల్లో నష్టపోతున్నారని తెలిపారు. ఓబీసీగా గుర్తించాలని అనేక ఏండ్లుగా కోరుతున్నట్టు చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర రైతు విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్‌రావు, ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జెండా రాజేష్ తదితరులున్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న డీపీఓ జగదీశ్వర్

దామెర : ‘మన ఊరు-మన బడి’ కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) జగదీశ్వర్ అధికారులను ఆదేశించారు. మండలంలోని కోగిల్వాయి, పులుకుర్తి గ్రామాల్లోని పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను శనివారం ఆయన సందర్శించి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు అందించారు. కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకొని పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఎంపీఓ యాదగిరి, సర్పంచ్‌లు విష్ణువర్ధన్‌రెడ్డి, గోవిందు అశోక్, కార్యదర్శులు శ్రీనివాస్, సరళ, ఉపసర్పంచ్‌లు మెంతుల రాజు, గోల్కొండ సాంబయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి రూ.కోటి మంజూరు



ఎంపీ సంజయ్‌తో మాట్లాడుతున్న నాయకులు

కమలాపూర్ : మండల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కోటి రూపాయలు మంజూరు చేసిందని బీజేపీ మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఎంపీ బండి సంజయ్‌ను కరీంనగర్‌లో అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలోని బృందం శనివారం కలిసి కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాలకు కేంద్ర ప్రభుత్వం ఈజీఎస్‌కు కోటి రూపాయలు కేటాయించిందని వివరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తుమ్మ శోభన్‌బాబు, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బండి కోటేశ్వర్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి భూపతి ప్రవీణ్, మైనార్టీ మోర్చా మండల అధ్యక్షుడు రాజీమహ్మద్, నాయకులు కుమ్మరి నరేష్, ముడిదె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బలమైన సైనిక శక్తిగా భారత్



కరియప్పకు నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్

హన్మకొండ: ఆనాడు ఫీల్డ్ మార్షల్ కరియప్ప వేసిన పునాదులే నేడు భారత బలమైన సైనిక శక్తిగా తయారయ్యాయని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ బత్తిని చంద్రమౌళి అన్నారు. హనుమకొండ వడ్డేపల్లిలోని పింగిలి ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో ఫీల్డ్ మార్షల్ కరియప్ప 124వ జయంతిని శనివారం జరుపుకున్నారు. ముందుగా కరియప్ప చిత్రపటానికి ప్రిన్సిపాల్ చంద్రమౌళి, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ కరియప్ప సేవలు, ధైర్య సాహసాలను ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు, అధ్యాపకులకు వివరించారు. కరియప్ప చరిత్రను నేటి యువత తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీలో జాతీయ స్థాయిలో ఉత్తమ అధికారిగా ఎంపికై అవార్డు స్వీకరించిన కెప్టెన్ డాక్టర్ ఎం.సదానందం సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుహాసిని, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు కల్పన, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలకు ఆంగ్లం దోహదం



సరస్వతి చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాగేశ్వర్‌రావు, ఇతరులు

విద్యారణ్యపురి: ఆంగ్లభాషలో నైపుణ్యం సాధిస్తే వర్తమాన సమాజంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, ఈక్రమంలో విద్యార్థులు ఆంగ్లభాషలో నైపుణ్యం పెంపొందించుకోవాలని ఇంటర్ ఆంగ్ల పుస్తకాల విషయ నిపుణుల కమిటీకి సారథ్యం వహించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు సూచించారు. హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం నూతన ఆంగ్ల పుస్తకాలపై శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం ఇంటర్ ప్రథమ, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు రెండుగంటల చొప్పున సదస్సులో వారికి అవగాహన కల్పించారు. ఆంగ్ల పుస్తకంలో పద్యభాగం, గద్యభాగం, వ్యాకరణ అంశాలను సరళమైన పద్ధతిలో నాగేశ్వర్‌రావు వివరించారు. హనుమకొండ, వరంగల్ ఇంటర్మీడియట్ విద్యాధికారులు గోపాల్, మాధవరావు, కళాశాల ప్రిన్సిపాల్ ధర్మేంద్ర, ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్ల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా జాయింట్ సెక్రటరీ ఎండి.అబ్దుల్‌ఘని, ఆంగ్ల పుస్తకాల కమిటీ సభ్యులు పరాంకుశం, ఆంగ్ల సీనియర్ అధ్యాపకులు బాబురావు, కిరణ్మయి, అరుణ్, ప్రభాత్, తదితరులు పాల్గొన్నారు.